క్లుప్తంగా

నేడు నూతక్కిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత..

తాడేపల్లి రూరల్: నేడు తాడేపల్లి మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నూతన విద్యుల్ లైన్లు ఏర్పాటు నిమిత్తం గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రకాష్ నగర్, డోలాస్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అనుమతి పొందిన బోర్డులను తొలగించలేదు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలో అనుమతి పొందిన బోర్డులను ఎక్కడా తొలగించలేదని నగర కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. బుధవారం కమిషనర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 167 బోర్డులుకు అనుమతులున్నాయన్నారు. ప్రభుత్వ చట్ట ప్రకారం వ్యాపార, వాణిజ్య ప్రకటనలకు మాత్రమే బోర్డులు, వాల్ పెయింట్‌లకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ఎవరైనా కొత్తగా గ్లో బోర్డులు ఏర్పాటు చేసుకోవాలంటే తప్పనిసరిగా రిటరి్నంగ్ ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నుంచి అనుమతులు పొందాలన్నారు. నిబంధనలకు లోబడి అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

27న హుండీ కానుకల లెక్కింపు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఈనెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు కార్యక్రమం 27వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఆసక్తిగల భక్తులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు



ఫిరంగిపురం: ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ వీరేంద్రబాబు అన్నారు. మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్, హౌస్ గణేష్ గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులతో బుధవారం కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూసేందుకు సమస్యాత్మక గ్రామంలో ముందస్తు చర్యల్లో భాగంగా కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆయనవెంట ఎస్ఐ వీరనారాయణ, సిబ్బంది ఉన్నారు.

22 నుంచి సువార్త సభలు

ఫిరంగిపురం: మండలంలోని గరుడాచలపాలెంలో ఈనెల 22నుంచి 24వ తేదీవరకు మూడు రోజుల పాటు క్రైస్తవ ఆరాధన మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో సువార్త సభలు నిర్వహించనున్నట్లు పాస్టర్ కె.జాన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసభలకు ముఖ్యఅతిథులుగా యూదా మినిస్ట్రీస్ పాస్టర్ కె.నెహమ్యా(గుంటూరు), హెర్మోన్ మినిస్ట్రీస్ పాస్టర్ ఎం.సునీల్‌కుమార్, సువార్త గాయకులు పాస్టర్ దియ్యా ప్రసాద్‌లు హాజరవుతారని చెప్పారు.

వ్యాక్సినేషన్ కేంద్రాల తనిఖీ



మంగళగిరి: పట్టణంలోని గణపతినగర్‌లోగల డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని జాతీయ వ్యాధి నిరోధక టీకాల కేంద్రాలను బుధవారం ఢిల్లీ నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ఇమ్యునైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ఆయుషి తనిఖీ చేశారు. దేవస్థానం వద్దనున్న రెండవ వార్డు సచివాలయం, రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు కళావేదికలో కల చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాల కేంద్రాలను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీకాలు వేయించుకున్న పిల్లల జాబితాను పరిశీలించి పిల్లలందరికి టీకాలు వేయాలన్నారు. అనంతరం గణపతినగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధానికి అందరం సిద్ధం

- కార్యకర్తలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం
- ప్రతి కార్యకర్త తలెత్తుకుతిరిగే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేశారు
- కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి చేశాం
- మన ప్రత్యర్థి నాన్ లోకల్
- మన అభ్యర్థి లావణ్య లోకల్
- మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వేదికపై ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో మే 13వ తేదీన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల జరుగనున్నాయని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు మనందరం సిద్ధంగా ఉండాలని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్ పేటలో వున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ, రూరల్ కార్యకర్తలతో విస్తృత సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, పార్టీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్యతో విస్తృతస్థాయి సమావేశాన్ని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళగిరి నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తలెత్తుకుని తిరిగే విధంగా అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పరిపాలన చేశారని, 2014 నుంచి 2019 వరకు ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు, మూడు శాఖల మంత్రిగా వున్న నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలన్నారు. 2019 నుంచి 2024 వరకు మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నడూ జరగని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో చేశామని, నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గాన్ని గచ్చిబౌలిగా తీర్చిదిద్దుతానని సభలు, సమావేశాల్లో చెబుతున్నారని, గచ్చిబౌలిలో వ్యాపారవేత్తలు, పెట్టుబడి దారులు మాత్రమే నివాసముంటారని, మంగళగిరి నియోజకవర్గంలో 90శాతం పేద ప్రజలే ఉన్నారని, వారికి విద్య, వైద్యం, నివసించేందుకు మంచి ఇళ్లు కావాలని, వాటిని సైతం అడ్డుకున్న ఘనత నారా లోకేష్ అనుచరులదని, గతంలో పేదలు నివసించడానికి వీలు లేకుండా మంగళగిరి నియోజకవర్గంలో ముఖ్యంగా తాడేపల్లిలో అనేక జోన్‌లు ఏర్పాటు చేసి పేద ప్రజలను ఇబ్బంది పెట్టారని, ఇప్పుడు 20 వేలమంది పేదలకు ఇళ్ల నిర్మిస్తామని చెబుతున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన స్థలాల్లో ఇక్కడ పేద ప్రజలు నివాసం ఉండడానికి వీలులేదంటూ కోర్టును ఆశ్రయించిన వారు రేపు ఎలా ఇస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. వారు రాజధానిగా చెబుతున్న ప్రాంతాల్లో పేద ప్రజలు ఉండకూడదని కోర్టును ఆశ్రయించిన వారు మంగళగిరి నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇస్తారు? ఎక్కడ స్థలాలు ఉన్నాయో చెప్పాలని, 2014 నుండి 2019వరకు ఎటువంటి సమస్యలు పట్టించుకోని వారు ఇప్పుడు సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారో ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో 80 శాతం మంది పేదలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారని టీడీపీ వారు ఇళ్ల పట్టాలను అడ్డుకున్నారని, తాడేపల్లితో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు నిబంధనల ప్రకారం ఆ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించామని, రాబోయే కాలంలో రిజిస్ట్రేషన్‌కు యోగ్యమైన ప్రతి ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి పేద ప్రజలకు అందిస్తామని హామీ ఇచ్చారు. నారా లోకేష్ ఆర్థికంగా బలమైన వ్యక్తే కానీ ఆయనకు గెలుపు రేఖ లేదని, ఇప్పటికే వారి ఇంట్లో గాజు వస్తువులు, టివిలు ప్యాక్ చేసి హైదరాబాద్ పంపించారని, మంగళగిరి నియోజకవర్గంలో తాడేపల్లి పట్టణ, రూరల్‌లో మురుగుడు లావణ్యకు 15 వేల మెజార్టీ వస్తుందని, మంగళగిరిలో సైతం లావణ్య మెజార్టీ వస్తుందని, దుగ్గిరాల ప్రజలు తాడేపల్లి ప్రజలు ఎప్పుడూ వైఎస్సార్ సీపీకే మెజార్టీ అందిస్తారని, మరోసారి సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే మంగళగిరి కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ ఈదులూడి డేవిడ్ రాజు, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పాతూరు లలిత కుమారి, పార్టీ తాడేపల్లి రూరల్ మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, మంగళగిరి నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, మిరియాల రాంబాబు, పార్టీ అనుబంధ సంస్థ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వచ్చిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, మురుగుడు లావణ్య

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని గుండిమెడ నుంచి టీడీపీకి చెందిన కొంతమంది బుధవారం రాత్రి ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గతంలో టీడీపీలో చురుగ్గా పనిచేసిన బీసీ వర్గానికి చెందిన వీళ్లంతా వైఎస్సార్ సీపీలో చేరడం ఆనందించదగ్గ విషయమని ఎమ్మెల్యే ఆర్కే అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు రాజకీయాల్లో సామాజిక న్యాయం పాటించడంవల్లే బీసీలు ఎంతోమంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని, రాబోయే కాలంలో మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీతో పాటు ఇతర పార్టీల నుంచి ముఖ్యనాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే అన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, గుండిమెడ పార్టీ అధ్యక్షుడు గుండిమెడ అర్జునరావు, జేసీఎస్ కన్వీనర్ నామతోటి కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, మిరియాల రాంబాబు, నూతక్కి శ్రీను తదితరులు పాల్గొన్నారు. వైస్సార్‌సీపీలో చేరిన వారిలో గుండిమెడకు చెందిన సింహాద్రి శ్రీనివాస్, చెరుకూరి రాజేష్, జంపల వెంకటేష్, ఉయ్యూరు కార్తీక్, ఉయ్యూరు వంశీకృష్ణ, నాజా వెంకటేష్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జేసీ రాజకుమారి
- పోలింగ్ కేంద్రాల పరిశీలన

మంగళగిరి: పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సీకే జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాజకుమారి విలేకరులతో మాట్లాడుతూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడడంతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎవరైనా రూ.50వేలకు మించి నగదు వ్యక్తిగతంగా ఉన్నా, రూ.లక్షకు మించి బ్యాంక్‌లో జమచేసినా తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుందన్నారు. ప్రజలంతా ఎన్నికల నిబంధనలను తెలుసుకుని అధికార యంత్రాంగానికి సహకరించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో దుగ్గిరాల మండలంలో 55 పోలింగ్ కేంద్రాలను, తాడేపల్లిలో 46 పోలింగ్ కేంద్రాలను మంగళగిరిలోని కేంద్రాలను పరిశీలించి అధికారులకు అన్ని సూచనలు చేయడం జరిగిందన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిలో పోలింగ్‌బూత్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ రాజకుమారి

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ రిటరి్నంగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు సెక్టార్లలో పోలింగ్ బూత్‌లను పరిశీలించి స్థానిక అధికారులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తాడేపల్లి సెక్టార్–4 లో 10 పోలింగ్ కేంద్రాలను, మంగళగిరి సెక్టార్–16లోని 16 పోలింగ్ కేంద్రాలను, సెక్టార్–20లో 9 పోలింగ్ కేంద్రాలు మొత్తం 35 పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలపై స్థానికంగా ఉన్న అధికారులతో చర్చించామని, ఎన్నికల రోజు ఓటుహక్కు వినియోగించుకునే వారికి అంతరాయం కలగకుండా లైట్లు, ఫ్యాన్లు, టాయిలెట్లు, పోలింగ్ కేంద్రాల్లో ఫర్నిచర్, క్యూ లైన్లు ఏర్పాటు చేయడం వంటి సదుపాయాలను పరిశీలించి వాటిపై సూచనలు, సలహాలు అందజేశామని ఆమె తెలియజేశారు.

వైభవంగా వార్షిక మహోత్సవాలు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలోని కాశీ విశ్వేశ్వరస్వామి 108వ వార్షిక మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండస్థాపన, కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం లక్ష్మీగణపతి రుద్రహోమం, 22న 108 దంపతులచే సూర్యనారాయణస్వామి కల్యాణం, 23న హనుమాన్‌చాలీసా పారాయణం, 24న స్వామివారి గ్రామోత్సవం, 25 హోమం నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమాలు, విశేష అర్చనలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రక్తదానం ప్రాణదానం



మేడికొండూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరు నెలలకొకసారి రక్తదానం చేయడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి అనారోగ్య సమస్యలు దరి చేరవని డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని డోగిపర్రు అడ్డరోడ్డులో గల యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సెయింట్ జోసఫ్ జనరల్ ఆసుపత్రి, గుంటూరు కళాశాల ఎస్ఎస్ యూనిట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సెయింట్ జోసఫ్ జనరల్ ఆసుపత్రి చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ ఫాతిమామర్రెడ్డి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేశవరెడ్డి, ఎస్.ఎస్.ఎస్. యూనిట్ కో–ఆర్డినేటర్ మోపర్తి రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మర్రెడ్డి, కళాశాల పలు విభాగాధిపతులు కిషోర్‌బాబు, షారోన్, ఎస్.రాణి, మధువాణి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ చెక్‌పోస్టులు తనిఖీ

తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను డీఎస్పీ ఎం.రమేష్ బుధవారం తనిఖీ చేశారు. తెనాలి జేఎంజే కళాశాల వద్ద త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. అలానే రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో పెదరావూరు, నందివెలుగు, సంగాజాగర్లమూడి, బుర్రిపాలెం రోడ్డులో చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశారు. వీటిని డీఎస్పీ పరిశీలించారు. డీఎస్పీ వెంట త్రీ టౌన్ సీఐ ఎస్ రమేష్‌బాబు ఉన్నారు.



చెక్‌పోస్ట్ తనిఖీ చేస్తున్న దృశ్యం

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: అమెరికాలో ఇటీవల మృతి చెందిన బుర్రిపాలెం వాసి పరుచూరి అభిజీత్ జ్ఞాపకార్థం శివాజీ చౌక్‌లోని శ్రీ కాళీమాత దేవస్థానం వద్ద బుధవారం పేదలకు అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్, దేవస్థాన కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, కనకమేడల మురళీకృష్ణ, కందేపి సీతారామయ్య, అభిజీత్ తలిదండ్రులు శ్రీలక్ష్మి, చక్రధర్, మహిధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధైర్యలక్ష్మీ నారాయణుల కల్యాణం

పాత గుంటూరు: అరండల్ పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం ధైర్యలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ నిర్వహణలో అభిషేకాలు, కుంకుమ పూజలు, హారతి, మంత్రపుష్పం, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వ్యక్తి మద్యం విక్రయిస్తుండడాన్ని గుర్తించి పరిశీలించారు. అతని వద్ద 12 మద్యం బాటిళ్లు లభించడంతో వాటిని స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

తెనాలిరూరల్: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వృద్ధురాలి మెడలో గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన 65 ఏళ్ల వృద్ధురాలు బుధవారం మధ్యాహ్నం దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో గొలుసును అపహరించుకెళ్లారు. దీనిపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. మూడు సవర్ల గొలుసు అపహరణకు గురైందని బాధితురాలు చెబుతోంది.

ప్రపంచ శాంతికోసం 'రన్ ఫర్ జీసస్'

మంగళగిరి: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ప్రతి ఏడాది నిర్వహించడం జరుగుతుందని పలువురు పాస్టర్లు తెలిపారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని టౌన్ చర్చిలో బుధవారం రన్ ఫర్ జీసస్ కరపత్రాలను పాస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి 30వ తేదీ శనివారం ఉదయం 5.30 గంటలకు ప్రారంభమయ్యే రన్ ఫర్ జీసస్ పరుగులో ప్రజలంతా పాల్గొని ప్రపంచ శాంతికి కృషి చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఎస్సీ నాయకుడు కారుమంచి రామారావు, పాస్టర్లు తిమోతి, రవికుమార్, వివేక్, కె.రూఫస్ తదితరులు పాల్గొన్నారు.



రన్ ఫర్ జీసస్ పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, పాస్టర్లు

కేఎల్‌యూలో ముగిసిన ఫిలిం ఫెస్టివల్



ఫొటోబుక్‌ను విడుదల చేస్తున్న యాడ్ ఫిల్మ్ డైరెక్టర్ బెంజిమిన్ గైని, అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్ అభిసంగ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఫిలిం ఫెస్టివల్ వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా విచ్చేయగా చిత్ర పరిశ్రమ నిపుణులు, చిత్ర నిర్మాతలు, ఔత్సాహికులు పెద్దసంఖ్యలో పాల్గొని లలిత కళల విభాగం విద్యార్థులకు చిత్రపరిశ్రమ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగ కల్పన విభాగం డీన్ డాక్టర్ ఎస్.వి.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకాంత్ రూపొందించిన ఫొటోబుక్‌ను యాడ్ ఫిల్మ్ డైరెక్టర్ బెంజిమన్ గైని, అసిస్టెంట్ సినిమాటోగ్రఫీ అభిసంగం విడుదల చేశారని, శ్రీకాంత్ వర్ధమాన చలనచిత్ర నిర్మాతల విభిన్న ప్రతిభను మరియు సృజనాత్మకతను ప్రదర్శించే షార్ట్ ఫిల్మ్‌ల ప్రదర్శనలకు హాజరైన వారిని అభినందించారని తెలిపారు. కేఎల్‌యూ లలిత కళల విభాగం రూపొందించిన పేజెస్ టు పిక్చర్స్ పుస్తకాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్ ఆవిష్కరించారు. వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, విద్యార్థులు ప్రోగ్రెషన్, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్, ఉద్యోగ కల్పన విభాగం డీన్ డాక్టర్ ఎస్.బి.వి.ప్రసాద్, లలిత కళల విభాగాధిపతి యలవర్తి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

ఏపీ పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామం శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా పంటను భద్రపరచుకుని నష్టపోయిన రైతులను న్యాయం చేయాలని ఏపీ పసుపురైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో ఏపీ పసుపు రైతుల సంఘం ఆధ్వర్యంలో దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధితుల సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అగ్నిప్రమాద బాధితుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకట రామయ్య అధ్యక్షత వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, న్యాయవాది కొండూరు వీరయ్య, రవికుమార్, రైతుసంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

ఫైలేరియా క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోండి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: తెనాలి కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఫైలేరియా క్లినిక్‌లను ఏర్పాటు చేయటం జరిగిందని దానిని అవసరమైన వారు ఉపయోగించు కోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సూచించారు. ఫైలేరియా క్లినిక్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న మలేరియా, ఫైలేరియా కార్యాలయాలను పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బుధవారం ఇక్కడ ఫైలేరియా క్లినిక్‌ను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఫైలేరియా రోగులకు ఉచితంగా మందులు సైతం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడు వ్యాపు వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీ జాన్ మాట్లాడుతూ వైద్యశాలలో వివిధ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే మందులను కూడ ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం లెప్రా సొసైటీ వారి సహకారంతో రోగులకు పాదరక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సిబ్బంది జి రవికుమార్, శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.



పాదరక్షలు పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

వైభవంగా శేషవాహనంపై శ్రీవారి నగరోత్సవం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. విశ్వక్సేన ఆరాధన, సామూహిక, విష్ణు, లలితా సహస్రనామ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సభకు ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. శేషాచల ఆశ్రమం పీఠాధిపతి నిర్వికల్పానందస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. సభలో కేంద్రశాఖ సంక్షేమ శాఖ చైర్మన్ వల్లూరి జయప్రకాష్ నారాయణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, విశ్రాంత న్యాయమూర్తి కేజీ శంకర్ పాల్గొన్నారు. సాహితీవేత్తలు మల్లాప్రగడ శ్రీమన్నారాయణ, నోరి నారాయణమూర్తి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ పాల్గొన్నారు.



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు